విద్రోహశక్తులతో దేశానికి ముప్పు



బీజేపీ నేత శ్రీరాములు యాదవ్

సరూర్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ దేశంలో విద్రోహశక్తులు పేట్రేగిపోతున్నాయని, వారి వల్ల దేశ భద్రతకు పెనుముప్పు పొంచి ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ సామాజిక భద్రతపై అవగాహన కలిగిఉండాల్సిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన పేలుడు సంఘటన, ఎన్ఐఏ అధికారులు పలువురు వైద్యులను అరెస్టు చేసిన సంఘటన నేపథ్యంలో శనివారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీరాములుయాదవ్ మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ భద్రతకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ఎన్డీయే కాకుండా వేరే ప్రభుత్వం అధికారంలో ఉంటే దేశంలో నిత్యం అలజడులు జరిగేవని, మోదీ హయాంలోని ప్రభుత్వం ఉగ్రవాదులను కట్టడి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటూ సత్ఫలితాలు సాధిస్తుందని ఆయన అన్నారు. ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నదని, అనుమానాస్పద వస్తువులుగానీ, వ్యక్తులుగానీ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. గ్రామాల్లో, కాలనీల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుని స్థానిక ప్రజలకు సామాజిక భద్రతపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.



విద్యుత్ వైర్ల సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

మన్సూరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా శనివారం డివిజన్ పరిధిలోని బాలాజీనగర్, ప్రియదర్శిని కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, వైర్ల సమస్యలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ ఏఈ మీర్జావుద్దీన్ ఖాదీర్, ఎల్ఐ బలరాం, అసిస్టెంట్ లైన్‌మెన్ శివ, శ్రీనివాస్, ఆయా కాలనీవాసులు శేఖర్‌రెడ్డి, రఘురాంరెడ్డి, గంజి వెంకటేష్, మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మహేంద్రనాథ్, యూసుబ్ తదితరులు ఉన్నారు.



పార్కులో అభివృద్ధి పనులను ప్రారంభించిన కార్పొరేటర్ అరుణా సురేంద్రనాధ్ యాదవ్

ప్రశాంతత, ఆరోగ్య రక్షణకు పార్కులు దోహదం

మన్సూరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతత, ఆరోగ్య రక్షణకు పార్కులు ఎంతగానో దోహదపడతాయని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాధ్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని మమతా నగర్ కాలనీ పార్కులో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతల అరుణ మాట్లాడుతూ పార్కులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మమతానగర్ కాలనీ పార్కులో రూ.11.5లక్షల వ్యయంతో చుట్టూ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, పేయింటింగ్ వంటి పనులను చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీధర్, సభ్యులు ప్రభావతి, సురేఖ, శ్రీనివాస్‌గౌడ్, రామ్మోహన్, శ్రీలత, మహేష్, కార్తీక్, అమర్, శ్రీను, రామాచారి ఉన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



రాఘవేంద్రకాలనీలో చేపట్టే సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రాఘవేంద్రకాలనీలో రూ.49లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

- కొత్తపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి)

'బిర్సా ముండా పోరాటం ఆదర్శనీయం'

మన్సూరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమంలో, మిలీనేరియన్ ఉద్యమంలో, ఆదివాసీ స్వాతంత్ర్య సమరంలో భగవాన్ బిర్సా ముండా పోరాటం ఆదర్శనీయమని విశ్రాంత ఐఏఎస్, ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ జేబీ రాజు పేర్కొన్నారు. నాగోల్ బండ్లగూడలోని జీఎస్ఐ ఆవరణలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జీఎస్ఐ సంస్థ హెచ్ఓడీ బసబ్ ముఖోపాధ్యాయ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ మోహన్ మిశ్రా, డిప్యూటీ డీజీలు ఎల్‌పీ సింగ్, ఎస్ఎం మహాపాత్రో, కేవీ మారుతి, అజయ్‌నిర్వాణ్, ఎం.శ్యాం, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్శ మహేష్, సభ్యులు జె.రాజశేఖర్, ఎస్ఎస్ తారకేశ్వర్‌రావు, సభ్యులు ఉన్నారు.



పోచమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న షిర్డీనగర్ కాలనీ నాయకులు

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

హయత్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని షిర్డీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న పోచమ్మ దేవాలయం నిర్మాణానికి శనివారం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. అమ్మవారి శిలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నక్క రవీందర్‌రెడ్డి, కుమ్మరి నర్సింహులు, కాలనీ పెద్దలు పారంద నర్సింగ్‌రావు, శేఖర్‌రెడ్డి, జక్కిడి జయేందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రామకృష్ణతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మినీ ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన లారీ

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యూటర్న్ తీసుకుంటున్న మినీ ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, కండక్టర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని మియాపూర్ నుంచి సమన్వి ప్రైవేటు మినీ ట్రావెల్స్ బస్ 32 మంది ప్రయాణికులతో శుక్రవారం రాత్రి అబ్దుల్లాపూర్‌మెట్‌కు వచ్చింది. ప్రయాణికులను దింపి రాత్రి 11.30 గంటల సమయంలో మినీ ట్రావెల్స్ బస్ విజయవాడ జాతీయ రహదారిపై రామోజీఫిల్మ్ సిటీ ముందు నగరం వైపుకు యూటర్న్ తీసుకుంటుంది. అదే సమయంలో నగరం నుంచి విజయవాడ వైపుకు ఓవర్ స్పీడుతో వెళ్తున్న లారీ బస్ డ్రైవర్ వైపు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్ డ్రైవర్ అనిల్‌గౌడ్ కాలుకు, పక్కనే కూర్చున్న కండక్టర్ భార్గవ్ నుదిటన గాయాలయ్యాయి. వెంటనే వారిని ఎల్‌బీనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. లారీ బలంగా ఢీకొట్టడంతో బస్ ముందు భాగం నుజ్జునుజ్జయింది ట్రావెల్స్ మేనేజర్ నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ రహదారిపై హిజ్రాల ఆగడాలు

అర్ధనగ్నంగా నిలబడి విటులను ఆకర్షిస్తున్న వైనం

పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా మారని తీరు



సరూర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాత్రి ఏడయిందంటే నాగార్జున సాగర్ రహదారిలో గుర్రంగూడ విపశ్యన కేంద్రం యూటర్న్ నుంచి తుర్కయంజాల్ మాసాబ్‌చెరువు వరకు హిజ్రాలు బారులు తీరుతున్నారు. అర్ధనగ్నంగా రోడ్ల పక్కన నిలబడి విటులను ఆకర్షిస్తున్నారు. నిత్యం రాత్రిపూట ఇలా జరుగుతుండడంతో రోడ్డుపై కుటుంబ సభ్యులతో వెళ్లే వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. హిజ్రాలకు తరచూ కౌన్సెలింగ్ ఇస్తున్నామని, పలువురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిస్తున్నామని పోలీసులు చెబుతున్నా.. ఆ చర్యలు నామ్‌కే వాస్తేగా మారుతున్నాయి తప్ప పరిస్థితిలో మార్పు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గతంలో సాగర్ కాంప్లెక్స్ వద్ద పోలీసు పికెట్

గతంలో బీఎన్‌రెడ్డినగర్ సమీపంలోని సాగర్ కాంప్లెక్స్ బస్టాప్ నుంచి ఇంజాపూర్ మలుపు వరకు ఈ పరిస్థితి ఉండేది. దీనిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించడంతో పోలీసులు హిజ్రాల ఆగడాలను అడ్డుకున్నారు. సాగర్ కాంప్లెక్స్ వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. నాలుగు రోజులకు పికెట్ ఎత్తివేయడంతో వారం రోజుల నుంచి యథాతథ స్థితి కనిపించింది. సాగర్ కాంప్లెక్స్ నుంచి గుర్రంగూడ బస్టాప్ వరకు పలు షాపులు ఏర్పాటు కావడంతో హిజ్రాలు తమ అడ్డాను గుర్రంగూడ యూటర్న్ నుంచి మాసాబ్‌చెరువు వరకు మార్చుకున్నారు. ఈ రహదారిలో పోలీసు అధికారుల వాహనాలు తిరుగుతున్నా హిజ్రాలను కట్టడి చేయడానికి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్‌సీఐ రోడ్డులో..

కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం సమీపంలోని మంద మల్లమ్మ చౌరస్తా నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు గల ఆర్‌సీఐ రోడ్డులోనూ హిజ్రాల ఆగడాలు మితిమీరుతున్నాయి. జిల్లెలగూడ చందచెరువు ప్రాంతంలో ఎస్‌వైఆర్ గార్డెన్స్ వరకు గల రోడ్డుకిరు పక్కలా పదుల సంఖ్యలో హిజ్రాలు నిలబడి అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు హిజ్రాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు లబ్ధి : సుధీర్‌రెడ్డి



సైదమ్మ కుటుంబ సభ్యుడికి ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

కొత్తపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధితో ఎంతో మంది పేదలకు లబ్ధిచేకూరుతోందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో నివాసముండే సైదమ్మ అనారోగ్య సమస్యతో ఇటీవల ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఎమ్మెల్యే సహకారంతో సీఎంఆర్ఎఫ్‌కు ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి మంజూరైన రూ.3లక్షల ఎల్ఓసీ పత్రాన్ని శనివారం తన క్యాంపు కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, ముద్దగౌని సతీష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

ఎల్‌బీనగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రాకేశ్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు కుశాల్, మధుసాగర్, ఆనంద్ ముదిరాజ్ తదితరులున్నారు.

న్యూబృందావన్ కాలనీకి చెందిన వ్యక్తికి సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ

సరూర్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లోని న్యూబృందావన్ కాలనీకి చెందిన కె.శ్యాంసుందర్ ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా వైద్యానికి అధిక మొత్తంలో ఖర్చయింది. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఇటీవల ఆయనను పరామర్శించి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఆయన దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం రూ.33వేలు మంజూరు చేసింది. దానికి సంబంధించిన ఎల్ఓసీని శనివారం బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనునాయక్ తదితరులు బాధితుడికి అందజేశారు.

సంకల్పమే భవిష్యత్‌ను నిర్మిస్తుంది

- త్రిదండి చిన జీయర్ స్వామి



వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుతో చిన జీయర్ స్వామి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సంకల్పమే భవిష్యత్‌ను నిర్మిస్తుందని త్రిదండి శ్రీమన్నరాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పరిధిలోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఇక్వాలిటీ-2025 వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన జీయర్ స్వామి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. జ్ఞానం విలువలతో కలిసినప్పుడే విద్యార్థులు ప్రగతి సాధించి దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్కా కొమరయ్యతో కలిసి వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు షీల్డ్‌లతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవానంద స్వామి, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్కా నవీన్‌కుమార్, అకాడమిక్ అడ్వైజర్ ఎస్‌జీఎస్ మూర్తి, మాధవి, డైరెక్టర్ డాక్టర్ రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబీ రాజు తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్



ప్రత్యేక లోక్‌అదాలత్‌లో ఒప్పంద అవార్డును అందజేస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఉత్తమ మార్గమని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కోర్టుల ప్రాంగణాలలో శనివారం ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో రాజీపడి కేసు పరిష్కరించుకుంటే ఇరు పక్షాలు గెలిచినట్లేనన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల ప్రాంగణాలలో 20 లోక్ అదాలత్ బెంచిలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ప్రత్యేక లోక్‌అదాలత్‌లో మొత్తం 2050 పైచిలుకు కేసులు పరిష్కరించబడ్డాయని ఆయన చెప్పారు. అన్ని కేసులలో రూ. 1,33,80,000/-ల వరకు నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

హయత్‌నగర్‌లో 430 కేసులు పరిష్కారం

హయత్‌నగర్ : హయత్‌నగర్ కోర్టులో శనివారం స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని మొత్తం 430 కేసులు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో 14వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సల్మాఫాతిమా, ఏడో అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఫర్హీన్‌బేగం, ఏపీపీ లావణ్యకుమార్, అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోడం ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్ మేకల సతీష్, జనరల్ సెక్రెటరీ రామ్మోహన్, ప్రవీన్‌కుమార్, సాంబశివులు, పద్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బాల్య వివాహాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ కుంట్లూర్ సెక్టార్ సూపర్‌వైజర్ వనజా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని అతిక్రమిస్తే శిక్ష తప్పదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కృష్ణయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు వజ్రమ్మ, కల్పన, రజినీ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు శిక్షణ తరగతులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల నియమితులైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు నిర్వహించిన శిక్షణ తరగతులను శనివారం రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ ప్రారంభించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లాలోని వివిధ కోర్టుల జడ్జీలతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి కార్తీక్ బాసెట్టి, సీనియర్ న్యాయవాది శ్రీనాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు అనంతసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- శుభాకాంక్షలు



తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర స్థానిక కార్యదర్శిగా ఎన్నికైన వనస్థలిపురానికి చెందిన వై.కర్నాకర్ రెడ్డిని ఎస్టీయూ రాష్ట్ర కమిటీ ప్రతినిధి బృందం శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

- వనస్థలిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి)

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

మన్సూరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ ఎరుకలనాంచారమ్మ బస్తీ డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. జనహిత సేవా ట్రస్ట్, యూత్ ఫర్ సేవా, కిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరాన్ని బీఆర్ఎస్ పార్టీ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కిమ్స్ ఆస్పత్రి వైద్యులు సుమారు 150 మందికి వైద్య పరీక్షలను చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నరసింహమూర్తి, గణేష్, ఫిజియోథెరపిస్ట్ ఎం.శ్రీనివాస్, యూత్ ఫర్ సేవా సభ్యులు చరణ్ పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ కమిషనర్‌కు మోదీ ఫొటో అందజేస్తున్న బీజేపీ నేతలు

కాంగ్రెస్ కార్యకర్తలా వ్యవహరిస్తున్న కమిషనర్

- మోదీ ఫొటో తొలగించడంపై బీజేపీ నేతల ఆగ్రహం

సరూర్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్ సరస్వతి బాధ్యత గల అధికారిగా కాకుండా అధికార కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. మునిసిపల్ కార్యాలయంలో గతంలో ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ చిత్రపటం తొలగించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-1 అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి శనివారం పార్టీ నాయకులతో కలిసి కమిషనర్ సరస్వతిని ఆమె ఛాంబర్‌లో కలిసి మోదీ ఫొటో విషయమై నిలదీశారు. అనంతరం ఆమెకు మోదీ ఫొటో అందజేసి కార్యాలయంలో ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, పార్టీ మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు రేసు నర్సింహారెడ్డి, క్యారగారి అరవింద్, సైదులు, యాదిరెడ్డి, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో ప్లాట్ రిజిస్ట్రేషన్

- ముగ్గురు నిందితుల అరెస్ట్

ఉప్పల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లతో ప్లాటును రిజిస్ట్రేషన్ చేయించుకొని కబ్జా చేసేందుకు యత్నించిన ముఠా సభ్యులను ఉప్పల్ పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్‌బీనగర్ కొత్తపేటలో నివాసముండే విజయకుమారికి 1993లో తన పుట్టింటివారు కట్నం కింద ఉప్పల్ సాయిబాబా కాలనీలో 200 గజాల ప్లాటును ఇచ్చారు. ఖాళీగా ఉన్న ఆ ప్లాటుపై కబ్జాదారుల కన్నుపడింది. పథకం ప్రకారం.. ప్లాటు యజమాని చనిపోయినట్లుగా నకిలీ డెత్ సర్టిఫికెట్ తయారుచేసి ఆమెకు వారసురాలిగా ఆమె కూతురు రమ్య ఉన్నట్లుగా నకిలీ వ్యక్తిని సిద్ధం చేసి, ఆమె పేరుతో వారసురాలి సర్టిఫికెట్ తయారు చేశారు. రమ్య నుంచి ఆ ప్లాటును ఉప్పల్‌కు చెందిన రచల వెంకటరమణ పేరు మీద, ఆ తర్వాత రంగ సతీష్‌గౌడ్ పేరు మీద ఉప్పల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ ప్లాటులో మరో 100 గజాల స్థలాన్ని చాకలి లక్ష్మీదేవికి అమ్మారు. దీంతో ఆమె ప్లాటు వద్దకు వెళ్లే సరికి ప్లాటు అసలు యజమాని అక్కడికి చేరుకోవడంతో తాను మోసపోయిన విషయాన్ని తెలుసుకొని న్యాయం కోసం ఆమె ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈ ముగ్గురు నిందితులు గతంలో అనురాధ రగురామ్ అనే వ్యక్తి బతికుండగానే చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించి అతని ప్లాటును ఉపేందర్ అనే వ్యక్తికి అమ్మినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో నిందితులకు సహకరించిన కార్తీక్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

వనస్థలిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతపై విద్యార్థులకు తగిన అవగాహన కల్పించాలని హైదరాబాద్ జిల్లా అదనపు జడ్జి మురళీమోహన్ సూచించారు. వనస్థలిపురంలోని వాసవీ నిలయంలో సొసైటీ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదాలు వాటి నివారణపై విద్యార్థులకు, చిన్నారులకు అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి జడ్జి మురళీమోహన్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ నర్సింహ్మా ప్రసాద్, కార్యదర్శి అచ్యుత్ రామ్, మనోజ్, శ్వేత, ఆరతి, దీప తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక క్రీడా పోటీలు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెంలోని క్యాండర్ ప్రైన్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో 12వ వార్షిక క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. మూడు రోజుల క్రితం ప్రారంభమైన ఆయా క్రీడా పోటీల్లో విద్యార్థులు తమ సత్తాచాటారు. స్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించిన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి డీఆర్‌డీవో శాస్త్ర పరిశోధన అధికారి శాతాధిత్య బ్రౌమిక్, హయత్‌నగర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడ రంగలో విద్యార్థులు రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నేత లక్ష్మారెడ్డి మృతి



లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుర్రం లక్ష్మారెడ్డి(55) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఛాతీలో నొప్పి రావడంతో శుక్రవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఆయనను హస్తినాపురంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 9గంటల ప్రాంతంలో కన్నుమూశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మాజీ మేయర్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి తదితరులు శనివారం ఆయన మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. బడంగ్‌పేట్ కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, దడిగ శంకర్, రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, బి.కుమార్ తదితరులు లక్ష్మారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

'న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి'

సైదాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన న్యాయవాదులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం మలకపేట కల్యాణ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రాజేంద్రనగర్‌లో నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవన సముదాయం సమీపంలో పేద న్యాయవాదుల కోసం 30 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 40 వేల మంది న్యాయవాదులుండగా అందులో 10 వేల మంది పేదలు ఉన్నారని తెలిపారు. వారంతా ఇళ్ల అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో న్యాయవాదులు గంగావత్ నవీన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

- బీసీ ఆక్రోశ సభకు..



42శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించే బీసీ ఆక్రోశ సభకు ఎల్బీనగర్ నుంచి తరలి వెళ్తున్న బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ప్రధానకార్యదర్శి ఆలేటి శ్రీనివాస్‌గౌడ్, బీసీ కులాల సమన్వయ సంఘం అధ్యక్షుడు బొమ్మ రఘురాం నేత, బీసీఐఎఫ్ వ్యవస్థాపక సభ్యుడు చామకూర రాజు, బీసీ నేతలు కేవీ గౌడ్, పుష్పగిరి, ఆంజనేయులు, యాదగిరి నేత, ఉపేంద్రయాదవ్, జగదీష్ నేత, అశోక్‌గౌడ్, జ్ఞానేశ్వర్, సోషల్ జస్టిస్ పార్టీ నాయకులు బాలస్వామి, రాఘవేందర్ ముదిరాజ్, శ్యామన్న, కొండల్‌గౌడ్, చంద్రశేఖర్, కరీం, కృష్ణ తదితరులు

- మన్సూరాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి)